క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ విజయ చైతన్య

గోపాలపట్నం: నరవలోని బెహరా పాలిటెక్నిక్‌ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు 96 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని బెహరా విద్యాసంస్థల కార్యదర్శి బెహరా విజయచైతన్య అన్నారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు అధ్యాపకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్‌ డైరెక్టర్‌ బాణాల తరుణ్‌, ప్రిన్సిపాల్‌ సుకన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినియోగదారులతో మర్యాదగా మెలగండి



రైతులు, డ్వాక్రా, వ్యాపారులతో మాట్లాడుతున్న ఈవో ప్రసాద్‌

గోపాలపట్నం: వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని గోపాలపట్నం రైతు బజారు ఈవో ప్రసాద్‌ అన్నారు. ఈ మేరకు సోమవారం రైతు బజారులో రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బజారులో స్టాళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలన్నారు. బోర్డుపై నిర్దేశించిన ధరలకే కూరగాయలు, ఇతర సరకులు అమ్మకాలు జరపాలని ఆదేశించారు. నిషేధిత పాలిథిన్‌ సంచులను ఎవరూ వాడకూడదన్నారు. పండ్లను మగ్గబెట్టేందుకు నిషేధిత రసాయనాలు వాడరాదని, ఉద్యానవన అధికారులు సూచించిన పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకుడు శివ, శ్రీనాథ్‌ పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్‌ మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్‌ పి.వి.సురేష్‌

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్‌ కొండ ప్రాంతంలో మంచినీటి పైపులైన్‌ లీకులు ఏర్పడడంతో ప్రజలు సమస్యను వార్డు వార్డు కార్పొరేటర్‌ పి.వి.సురేష్‌ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మల్కాపురం మంచినీటి కార్యాలయ అధికారులకు అశోక్‌నగర్‌ ప్రాంత సమస్యను వివరించారు. దీంతో స్పందించిన వారు ఆ ప్రాంతానికి సోమవారం సిబ్బందిని పంపించి పైపులైన్‌ మరమ్మతులు చేయించారు. పనులను వార్డు కార్పొరేటర్‌ పి.వి.సురేష్‌ దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



వీధి లైట్లు వేయిస్తున్న వార్డు నాయకుడు గులిగిందల కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ప్రధాన సేవా మార్గం నుంచి గుల్లలపాలెం వెళ్లే మార్గంలో వెలగని వీధి లైట్లను తొలగించి సోమవారం కొత్తవి వేశారు. ఈ మార్గంలో వీధిలైట్లు నెల రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో ఆ మార్గాన వెళ్లే వాహనదారులు,పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య తెలుసుకున్న వార్డు కార్పొరేటర్‌ గులిగిందల లావణ్య విద్యుత్‌ అధికారులతో మాట్లాడి కొత్త లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌ సీపీ నాయకులు గులిగిందల కృష్ణ,వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బయటపడుతున్న డొల్లతనం!



సెకండ్రీ క్లారిఫైర్‌ నుంచి లీకవుతున్న మురుగు

- సెకండ్రీ క్లారిఫైర్‌లో లీకేజీ
- సీవేజ్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌లో ఇదే పరిస్థితి
- చోద్యం చూస్తున్న అధికారులు

గోపాలపట్నం: మురుగునీటిని శుద్ధి చేయడానికి ఏర్పాటు చేసిన ప్లాంట్‌ నిర్వహణలోపంతో సతమతమవుతోంది. ఫలితంగా లక్ష్యం నెరవేరడం లేదు. అయినా అధికారుల్లో చలనం లేదు. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 88వ వార్డు నరవ దరి సత్తివానిపాలెంలో ఏర్పాటు చేసి సీవేజ్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌ అస్తవ్యస్తంగా మారింది. లీకేజీలతో డొల్లతనం బయటపడుతోంది. ఇటీవల కురిసి వర్షాలకు ప్లాంట్‌ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఇక్కడి వారు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఇక్కడి సెకండ్రీ క్లారిఫైర్‌లో కూడా లీకేజీ వస్తుండడంతో ఇక్కడి పనిచేస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ క్లారిఫైర్‌లో వేల లీటర్ల నీరు ఉంటుందని ట్రీట్‌మెంట్‌ జరిగే సమయంలో లీకేజీ ఎక్కువై ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత లోపం...

సీవేజ్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌ కార్యాలయంలో మెట్లపై హెడ్‌ రూమ్‌ నిర్మాణంలో నాణ్యతా లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. వర్షం పడినప్పుడు నీరు మెట్లపై నుంచి కార్యాలయం లోపలికి వస్తోంది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం మరమ్మతులు చేయించడం లేదు. ఏటా లక్షల్లో మెయింటెనెన్స్‌ బిల్లలు జేబులు నింపుకోవడానికే వాడుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.



ఇటీవల పడిన వర్షాలకు నీరు కారుతున్న మెట్ల మార్గం

లీకుల బెడద

ఈ ప్లాంట్‌లో రెండు సెకండ్రీ క్లారిఫైర్లు ఉన్నాయి. అందులో ఒకటి ఎండిపోయింది. మరోదానిలో మురుగు నీరు ఉంది. ఈ క్లారిఫైర్‌ అడుగు భాగంలో చిన్నచిన్న లీకేజీతో నిత్యం మురుగు నీరు చిమ్ముతోంది. దీనికి కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని ఇక్కడి వారు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పెను ప్రమాదం చోటు చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

15 రోజుల కిందట ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్‌)లో స్వయంగా ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు దారులు వాపోతున్నారు. దీంతో దిగువస్థాయి సిబ్బంది, ఉద్యోగులను మాత్రం మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగులను తొలగించేందుకు .. అలా కాని పక్షంలో ఇక్కడి నుంచి మరో చోటుకు మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాపోతున్నారు.

‘కూటమి’ మోసాలను ఎండగడదాం



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌, ముఖ్య నాయకులు

- ప్రజలకు అండగా నిలుద్దాం
- ఏడాది పాలనలో ‘బాబు’ వెలగబెట్టిందేంటో..
- సంక్షేమ పథకాలను విస్మరించారు
- ‘వెన్నుపోటు దినం’లో ప్రజలంతా పాల్గొనాలి
- నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ మళ్ల విజయ ప్రసాద్‌

విశాఖ విద్య: సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకు అంతా సిద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైందని వైఎస్సార్‌ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ మళ్ల విజయ ప్రసాద్‌ అన్నారు. ఈ నెల 4న నిర్వహించ తలపెట్టిన ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమంపై సోమవారం రాత్రి ఎస్‌ఏడీ సెంటర్‌లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ కూడా అమలు చేయలేదని, దీనిపై ప్రభుత్వాన్ని ప్రజలంతా నిలదీయాలన్నారు. సూపర్‌ సిక్స్‌ పేరుతో ఆర్భాటపు ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. అనర్హుల పేరుతో గతంలో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను కూడా ఏరివేతకు పాల్పడుతూ, ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి అల్లా కృష్ణ మాట్లాడుతూ జగన్‌ మోహన్‌ రెడ్డి ముఖ్యమంత్రిగా అందించిన ప్రజా రంజక పాలన చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

నాడు అందించిన సంక్షేమ పథకాలన్నీ ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలను మోసగించి, గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ‘వెన్నుపోటుదినం’ నిరసన కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, యూత్‌, మహిళలు,ట్రేడ్‌ యూనియన్‌ ,స్టేట్‌ కమిటీ సభ్యులు,సిటీ కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకత ప్రతిధ్వనించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌, మాజీ డిప్యూటీ మేయర్‌ జియ్యాని శ్రీధర్‌, కార్పొరేటర్‌ పి.వి సురేష్‌, స్టేట్‌ యూత్‌ జనరల్‌ సెక్రటరీ దొడ్డి కిరణ్‌, 90వ వార్డు వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాద రెడ్డి, ఆదారి శ్రీనివాసరావు,పిన్నింటి అప్పలరాజు,చెంగల హరినాథ్‌, అంగన్‌వాడీ జిల్లా విభాగం అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత ,పార్టీ నాయకులు ఆళ్ల పైడిరాజు, యల్లపు వెంకటేశ్వరరావు, కొణతాల ఉమామహేశ్వరరావు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ జ్యోష్ణ , శ్రీదేవి వర్మ, ప్రమీల,గంగరాజు,ధనరాజు, కార్తీక్‌,కిరణ్‌ రెడ్డి,గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ. 3వేల కోట్ల టర్నోవర్‌ లక్ష్యం

డీసీసీబీ చైర్మన్‌ తాతారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న తాతారావు

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల టర్నోవర్‌ లక్ష్యంగా పనిచేస్తామని బ్యాంకు చైర్మన్‌ కోనా తాతారావు అన్నారు. మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. బ్యాంకు సీఈవో డీవీఎస్‌ వర్మ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ డీసీసీబీకి అనుసంధానంగా ఉన్న సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రైతులకు రుణాలు మరింత సులభతరంగా అందించి, వారికి తోడ్పాటుగా నిలుస్తామన్నారు. ప్రమాణస్వీకారం చేసిన తాతారావుకు విశాఖ, అనకాపల్లి ఎంపీలు శ్రీభరత్‌, సీఎం రమేష్‌, ఎమ్మెల్యేలు గణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

రెండు సెంట్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ పశ్చిమ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు డిమాండ్‌ చేశారు.పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తు 59వ వార్డు ములగాడ తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఇంటి స్థలాలు,టిడ్కో ఇళ్లు ఇస్తామని గడిచిన ఎన్నికల ప్రచారంలో హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికి ఒక్క నిరుపేదకు సెంటు భూమి ఇవ్వలేదని ఆరోపించారు. కూటమి నాయకులు ఎన్నికల్లో చెప్పింది ఒకటటి, గెలిచాక చేసేది మరోలా ఉందని మండిపడ్డారు. పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుడాల జయ,గండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరవు



సమావేశంలో దళితులపై జరుగుతున్న దాడులపై చర్చిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, గ్రామ బహిష్కరణలు ఎక్కువయ్యాయని, వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని భీమ్‌సేన వార్‌ డిమాండ్‌ చేసింది. కంచరపాలెంలోని తమ కార్యాలయంలో అధ్యక్షుడు కొరమాటి చిన్నారావు అధ్యక్షతన సమావేశమయ్యారు. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తెనాలిలో ముగ్గురు దళిత యువకులను నడి రోడ్డు మీద బహిరంగంగా కొట్టిన ఘటన చూస్తుంటే .. రక్షణ కరువైందని తెలుస్తోందని భీమ్‌సేన వార్‌ జనరల్‌ సెక్రటరీ డాక్టర్‌ వసంత రాజేంద్రప్రసాద్‌ అన్నారు. దళిత హోమ్‌ మినిస్టర్‌ అయినా కూడా ఈ సంఘటన జరగడం, అరికట్టలేని ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతోందన్నారు. కారంచేడు తరహా ఘటనలు పునరావృతం కావడం పాలక పార్టీల విధానాలే కారణమన్నారు. సమావేశంలో వైస్‌ ప్రెసిడెంట్‌ వి.వి.దుర్గారావు, కోశాధికారి బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్స్‌ జి.రవికుమార్‌, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్‌: బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఏఐబీడీపీఏ, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. యూనియన్‌ నాయకులు మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్‌ యాజమాన్యం కుల ధ్రువీకరణ పేరిట మహారాష్ట్ర సర్కిల్‌లోని ఎస్టీ అధికారులు, పెన్షనర్లను వేధిస్తోందని ఆరోపించారు. డీవోటీ ఆదేశాలను ఉల్లంఘిస్తూ పదవీ విరమణ చేసిన ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్‌ బెనిఫిట్స్‌ నిరాకరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, కోశాధికారి ఆర్‌.సత్యనారాయణ, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి పీఈసీహెచ్‌వీ సాగర్‌, అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, ఏఏ అష్రఫ్‌, జీఎస్‌ఎన్‌ రాజు, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లు పాల్గొన్నారు.

ట్రావెల్‌ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో గాయపడిన రామ్మూర్తి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌ సీ గేటు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం..అనకాపల్లి గవరపాలేనికి చెందిన నారాయణరావు (30), రామ్మూర్తి విగ్రహాల తయారీదారులు. మల్కాపురంలో విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఇక్కడికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం కోసం మల్కాపురం నుంచి శ్రీహరిపురం వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రావెల్స్‌ బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న నారాయణరావు తలపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న రామ్మూర్తికి కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం,శేషవస్త్రాలను అందించారు.

పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్‌–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమానికి వివిధ సమస్యలపై తొమ్మిది వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్‌ కమిషనర్‌ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్‌–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించాలి



నీతి కథలను వివరిస్తున్న గ్రంథాలయాధికారి అజేయ్‌

మల్కాపురం: నీతి,నిజాయతీతో జీవించడం వల్ల మనిషి స్వేచ్ఛగా,ఆత్మగౌరవంతో జీవించగలడని యువజన నాయకుడు చింతకాయల వెంకటరమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీతి,నిజాయితీలతో బతికితే చనిపోయిన తర్వాత కూడా ప్రజల మనసులో నిలుస్తామన్నారు. చిన్నారులు మొబైల్‌ ఫోన్‌ కంటే నీతి కథల పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

హోమీబాబా క్యాన్సర్‌ ఆస్పత్రికి బయట రక్తాన్ని అనుమతించాలి



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న దాడి శ్రీనివాస్‌

పెందుర్తి: అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్‌ ఆస్పత్రి.. రోగులకు మెరుగైన సేవలందించినా, వారికి అవసరమైన రక్తాన్ని బయటి నుంచి అనుమతించకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని సాయి హెల్పింగ్‌ హ్యాండ్స్‌ ప్రతినిధి దాడి శ్రీనివాస్‌ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఆస్పత్రికి సొంత రక్తనిధి ఉండడంతో, బయటి రక్తాన్ని అనుమతించట్లేదని, తక్షణమే రోగుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని బయటి బ్లడ్‌ బ్యాంకుల్లో దాతలు అందించే రక్తాన్ని అనుమతించేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌ హరేందిరప్రసాద్‌, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావులకు వినతిపత్రం అందించారు. హోమిబాబా క్యాన్సర్‌ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తున్న ఇతర రాష్ట్రాల రోగులు రక్తం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రోగికి కావాల్సిన రక్తం ఆస్పత్రిలో అందుబాటులో లేనపుడు వారి పరిస్థితి ఘోరంగా ఉంటోందన్నారు. ఆ సమయంలో బయటి రక్తాన్ని అనుమతించి, చికిత్స చేస్తే రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్‌: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లను సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్‌ బ్యాంక్‌ అకౌంట్‌ నెంబర్‌ 060810011006681, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్‌, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ యూబీఐఎన్‌ 0806081కు ఆన్‌లైన్‌ పేమెంట్‌ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ–మెయిల్‌ ఐడీ endow&eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న ఉరిపోసుకున్న వ్యక్తి

కూర్మన్నపాలెం: గ్రీన్‌సిటీకి సమీపంలో చెట్టుకు ఉరిపోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు అందించి న వివరాలివీ.. గుర్తు తెలియని వ్యక్తి 88 వార్డు గ్రీన్‌సిటీ వెలుపల చెట్టుకు ఉరిపోసుకొని మృతిచెందాడు. ఆత్మహత్యపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.